క్లుప్తంగా

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



అధ్యాపకులతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

హుజూరాబాద్: శాతవాహన వికల్పలో హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన శాతవాహన వికల్ప కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, జస్ట్ ఏ మినిట్, క్విజ్ , నృత్యం, రంగోలి పోటీలు నిర్వహించారు. రంగోలిలో కళాశాల విద్యార్థులు మధులత, నిఖిత తృతీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన అఖిల, స్రవంతి, సాయికుమార్, జశ్వంత్, భవాని, బాలస్వామి, రాజీ , నాగరాజు, రమ్య, స్రవంతి, శ్రీవల్లి, మధులత, నిఖితను అధ్యాపకులు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పరమేశ్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి లక్ష్మీనరసింహమూర్తి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు డా. గంగిశెట్టి శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.దినకర్, అధ్యాపకులు ఎస్. మధు, ఉదయశ్రీచారి, సమ్మయ్య, రాజ్ కుమార్, రమేశ్, స్వప్న, స్వరూప, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సంఘం నాయకులు

రామడుగు: భవన నిర్మాణ సంఘం సభ్యుడు, మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన ఎడవెల్లి రాయమల్లు అనారోగ్యంతో మృతిచెందారు. మండల భవన నిర్మాణం సంఘం సభ్యులు రూ.15 వేలు, షానగర్ గ్రామ భవన నిర్మాణం సంఘం సభ్యులు రూ.20 వేలు సమకూర్చి మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని బాడిపల్లె గ్రామంలో ఎండిన వరి పంటలను మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడారు. సాగునీరు లేక పంట నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. ఎండిన పంటలపై సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. వెంట రైతులు కాటం మల్లారెడ్డి, సందబోయిన ఎల్లయ్య, కాటం రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహంకాళి కొమురయ్య, నాగెల్లి రాజిరెడ్డి, బుర్ర తిరుపతి, ఎల్లయ్య తదితరులున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

శంకరపట్నం: కేశవపట్నంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, తాడికల్ ఎస్సెస్సీ కేంద్రాల్లో 330 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద కేశవపట్నం పోలీసులు విధులు నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

చొప్పదండి: బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన కొంకటి శేఖర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిర్ణయాలకు కట్టుబడి ఆయన వెంట బీఆర్ఎస్‌లో చేరానని మంగళవారం ప్రకటించారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ అవదానుల దత్తాత్రేయశర్మ, బ్రహ్మశ్రీ వేదమూర్తులు వేములవాడ వాస్తవ్యులు అనంత రామశర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దత్తాత్రేయస్వామి పూజ, సాయిబాబాకు పంచామృత స్నానం, పాలాభిషేకం ఎంతో భక్తితో నిర్వహించారు. గణపతి, నవగ్రహ, వాస్తు హవనం, నూతనంగా నిర్మించిన వంటశాల భవనాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం కాకడ్ హారతి, మంత్ర పుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాత్రి శ్రీశివరామకృష్ణ, శ్రీరామానంద, శ్రీభవానిశంకర, కొత్తపల్లి రామాంజనేయ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు, శ్రీషిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసుదర్శన మహాహోమం



శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెదిర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం వేదపండితులు శ్రీసుదర్శన మహాహోమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు ఆరాధన, సహస్రనామార్చన, ద్రావిడ వేద పారాయణం, పూర్ణశరణాగతి, పూర్ణాహుతి, ద్రావిడ వేద శాత్తుమర, ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నిర్వాహకులు వంగళ శ్రీనివాస్‌రెడ్డిశారద దంపతులు, కమిటీ సభ్యులు దొడ్డ లచ్చిరెడ్డి, సంపత్‌రెడ్డి, నాగుల రాజశేఖర్‌గౌడ్, ఏరెడ్డి మునిరెడ్డి, గిరి శ్రీనివాస్‌రెడ్డి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండ నారసింహుని కల్యాణం



నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

తిమ్మాపూర్: నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి, సీతారాముల వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతన్నాయి. ఈనెల 16 ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం లక్ష్మీనసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకన్న, చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు. వేడుకలకు సుమారుగా 10 వేల మంది వస్తారని, తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం 7 గంటలకు పుణ్యాహవచనం, మంత్సంగ్రహణం, అంకురార్పణ రుత్విక్ వరుణం, పటాధివాసం నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహణం, 4:30 గంటలకు లక్ష్మీనర్సింహస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరిపిస్తామన్నారు. రాత్రి 7 గంటలకుహోమం, నిత్యహోమం, స్వామి వారి గరుడ వాహన సేవ, బలిహరణ, తీర్థగోష్టి ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తిమ్మాపూర్: మాట్లాడుతున్న సీడీపీవో సబిత



రామడుగు: ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, మహిళలు

తిమ్మాపూర్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కరీంనగర్ రూరల్ సీడీపీవో సబితాకుమారి అన్నారు. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్, ఇందుర్తి గ్రామాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజశ్రీ, ఇందిర, అంగన్వాడీ టీచర్లు మంగ, మావురమ్య, సరస్వతి, విజయ, ఇందిర, ఏఎన్‌ఎం మమత పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

చొప్పదండి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య మేళా నిర్వహించారు. పోషణ పక్వాడ లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అదజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాజేశ్, ఏసీడీపీవో సౌందర్య, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గుండి పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్వాడా నిర్వహించారు. గోపాల్‌రావుపేట పీహెచ్‌సీ డాక్టర్ గ్రీష్మన్య మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తారని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధర: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని గంగాధర ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రోటీన్లు, కేలరీలు ఉన్న ఆహారం ఎలా తీసుకోవాలి, చిరుధాన్యాల ప్రాధాన్యత గూర్చి వివరించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి సరైన సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. గర్భిణులకు పండ్లు, రాగి జావ, చిక్కీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్వేతారాణి, మహేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రశాంతి, మెరిసి, సిస్టర్స్, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గంగాధరలో...



తిమ్మాపూర్: చిన్నారులకు అక్షరాభ్యాసం

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్, లక్ష్మీపూర్, పోచంపల్లి గ్రామాలలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పరామర్శించారు. వెంట మండల అధ్యక్షుడు రవీందరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, కరీంపేట, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులను కవ్వంపల్లి మంగళవారం పరామర్శించారు. వెంట మాజీ జెడ్పీటీసీ బత్తినిశ్రీనివాస్‌గౌడ్, బస్వయ్య, జగన్‌రెడ్డి తదితరులున్నారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలపురి మల్లేశం తల్లి మృతిచెందారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం మల్లేశంను పరామర్శించి రూ.ఐదువేల ఆర్థిక సాయం అందించారు. వెంట మాజీ ఎంపీపీ భూమారెడ్డి, రంగయ్య, సుధాకర్‌గౌడ్, రాజేందర్, చందు, లక్ష్మయ్య, కోలపురి శ్రీకాంత్, నిజానపురం చందు, పెద్ది రాజేందర్, తదితరులున్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శనిగరపు భాస్కర్

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని 387/6లోని మూడెకరాల భూమిలో కొంత ఆక్రమణచేసేందుకు ఓ వ్యక్తి యత్నిస్తున్నాడని ఇల్లందకుంటకు చెందిన శనిగరపు భాస్కర్, కిరణ్ ఆరోపించారు. డెబ్బై ఏళ్లుగా భూమి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు తాము చూపించిన భూమి చదును చేసుకోవాలని బెదిరింపులు, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులతోపాటు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. భూకబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకొని భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

- పనులు నిలిపివేయించిన అధికారులు



ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న భవనం

మానకొండూర్‌రూరల్: మండలంలోని పోచంపల్లి గ్రామానికి రెవెన్యూ గ్రామం కెల్లేడు శివారులో సర్వే నంబర్110లోని ప్రభుత్వ భూమిని ఓవర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారు. కొద్దిరోజుల నుంచి ఆ స్థలంలో ప్రార్థనా మందిర నిర్మాణం మొదలు పెట్టారు. గ్రామ ప్రజలు నిమ్మకు నీరెత్తినట్టుగా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్లాబ్ వేయడానికి సిద్ధం అవుతుండగా రెండు గ్రామాలకు చెందిన కొందు ఐదు రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ సీహెచ్. రాజు పనులు జరుగుతున్న ప్రదేశానికి సిబ్బందిని పంపించి ఎంక్వైరీ చేయించారు. అనంతరం ఎలాంటి ప్రొసీడింగ్ పత్రాలు, నిర్మాణానికి అనుమతులు లేనందున నిర్మాణ పనులు ఆపివేయాలని ఆదేశించారు. పనులు కొనసాగిస్తే, ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పంటపొలాలు ప్లాట్లుగా..



ప్లాట్లుగా మార్చేందుకు చదును చేసిన పంటపొలం

గంగాధర: దినదినాభివృద్ధి చెందుతున్న గంగాధర చౌరస్తాలో భూముల ధరలు ఒక్కసారిగా పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. దీంతో చౌరస్తాకు నలువైపులా ఉన్న వ్యవసాయ భూములకు డిమాండ్ పెరుగుతోంది. మొన్నటి వరకు వ్యవసాయ పనులతో కళకళలాడిన పంటపొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. పంట చేన్లను ప్లాట్లుగా మార్చుతున్న వ్యాపారులు రాజకీయ నాయకుల అవసరాలను ఆసరాగా తీసుకొని నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. గంగాధర చౌరస్తా నుంచి కరీంనగర్ రహదారిలో కురిక్యాల గ్రామం వరకు వ్యవసాయభూములు ప్లాట్లుగా మారాయి. బోయినపల్లి రహదారితో పాటు బూర్గుపల్లి రహదారి పక్కన వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారాయి. ప్లాట్లుగా మారుతున్న వ్యవసాయభూముల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశమున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదనే ఆరోపణలు. తమకు రావాల్సింది రాకుంటే ప్లాట్ల హద్దురాళ్లను తొలగించడం, వ్యాపారులు రాయ(బే)బారాలు జరపకుంటే ప్లాట్లకు గ్రామ పంచాయతీ అనుమతి లేదు, ఎవరైనా కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణాలకు పంచాయతీ అనుమతి ఇవ్వమని బోర్డులు ఏర్పాటు చేయడం, రావాల్సింది వస్తే బోర్డులు తీయించేవారని ఆరోపణలు. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి పక్కన మధురానగర్ చౌరస్తాకు రెండు కిలోమీటర్ల పరిధిలో పంట పొలాన్నీ ప్లాట్లుగా మార్చి హద్దులు వేయగా పంచాయతీ నిబంధనలు పాటించలేదని హద్దురాళ్ల తొలగించడం, అమ్మకం, కొనుగోళ్లు సజావుగా సాగిపోవడం పరిపాటిగా మారిపోయింది. పంటపొలాలను ప్లాట్లుగా మార్చుకోవాలంటే ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. వాటిని రియల్ఎస్టేట్ వ్యాపారులు పాటించడంలేదు. నివాస స్థలాలుగా మార్చాలనుకున్న వ్యవసాయభూమిని ఎంత విస్తీర్ణంలో లేఅవుట్ చేయాలనుకుంటున్నారో గ్రామ పంచాయతీలో ప్లాటింగ్ ప్లాన్‌తో దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ పాలకవర్గం సమావేశమై అనుమతినిస్తుంది. వ్యవసాయభూమిని(నాలా) నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా తహసీల్దార్ కార్యాలయంలో మార్పు చేసుకోవాలి. ప్లాట్లుగా మారుతున్న భూమిలో పది శాతం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ప్లాట్లుగా మార్చే స్థలంలో మురుగుకాలువలు, రహదారుల ఏర్పాటుకు స్థలం వదిలేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలు ఏర్పాటు చేయాలి. ఇటువంటి నిబంధనలు పాటించకుండా పంట పొలాలను ప్లాట్లుగా మార్చుతున్నారు. దీంతో పంచాయితీలకు రావాల్సిన పదిశాతం స్థలంతో పాటు వ్యవసాయభూమిని నాన్ అగ్రికల్చర్‌గా మార్చడం ద్వారా పంచాయతీలు వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెలువడుతున్నాయి.

నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయభూములను నాలాగా మార్పుచేసి అమ్మకాలు చేయాలి. నిబంధనలు పాటించని వెంచర్లలో భూములు కొనుగోలు చేసిన వారు ఇల్లు కట్టుకోవాలనుకున్నప్పుడు అనుమతులు రావు. నిబంధనల ప్రకారం ప్లాట్లు చేస్తున్న చోట హద్దురాళ్లు తొలిగించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

– జనార్దన్‌రెడ్డి, ఎంపీవో

అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఏఎం. రెడ్డి

కరీంనగర్‌టౌన్: ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని కాపాడుకోవాలని డాక్టర్ కేర్ హోమియోపతి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏఎం. రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ప్రతిమ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల తమ ఇష్టానుసారంగా మందులు వాడుతూ అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. హైదరాబాద్ కంటే జిల్లా కేంద్రాలు, పట్టణాలు, గ్రామస్థాయిల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. గత పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు రోగాలు విపరీతంగా పెరిగాయని, మందులకు లొంగని రోగాలు కూడా వస్తున్నాయని వెల్లడించారు. అన్ని వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్‌తరాలు బాగుండాలనే ఉద్దేశంతో 'థాంక్యూ డాక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ భార్గవి, డాక్టర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ రాజీవ్‌రహదారిలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బొమ్మకల్ స్టేజీ వద్ద పోలీస్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దు గ్రామం మొగ్దుంపూర్ స్టేజీ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయగా ప్రస్తుతం బొమ్మకల్ వద్ద ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్, పోలీసు, రెవెన్యూశాఖలకు చెందిన అధికారులతో ఏర్పాటు చేసి మూడు బృందాలు విడతల వారీగా విధులు నిర్వహిస్తారు. మొదటి బృందం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, రెండో బృందం మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 10గంటలు, మూడో బృందం రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు వాహనాలను తనిఖీ చేస్తారు. పెద్దపల్లి జిల్లా నుంచి కరీంనగర్‌కు అక్రమంగా నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల తరలింపును అడ్డుకునేందుకు బొమ్మకల్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపా రు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం విడిచిపెడుతున్నట్లు వివరించారు.

నియామకం

జమ్మికుంట: జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఈసీ సభ్యుడిగా మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన పులి అరవింద్‌రెడ్డిని నియమించినట్లు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరాముల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విలాసాగరం పృథ్వీరాజ్ మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటి శ్రీకాంత్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పూసాల కృష్ణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎలగందుల వెంకట్, రాష్ట్ర ఈసీ సభ్యుడు తిరుపతికి అరవింద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం పట్టివేత

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు చేయగా రూ.2130 మద్యం లభ్యమైందని ఎస్సై తోట తిరుపతిరెడ్డి తెలిపారు. ఎక్కువ ధరకు మద్యం అమ్మెతూ సొమ్ము చేసుకుంటున్నాడని, గ్రామాలలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మండలంలోని చల్లూరు గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఠాణాకు తరలించామని, డ్రైవర్, ఓనర్‌లపై కేసు నమోదు చేశామని వివరించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు

జమ్మికుంట: పట్టణంలో రెండు బెల్టు షాపుల్లో మద్యం పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. హౌజింగ్‌బోర్డు కాలనీలోని కిరాణా షాపులో రూ.10 వేలు, ఆదర్శ కాలనీలోని కిరాణాషాపులో రూ.3వేల మద్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

రేషన్ డీలర్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

గంగాధర: మండలంలోని మల్లాపూర్ రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన పలువురు ఆర్డీవోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కిలోకు 800 గ్రాముల తూకం వేస్తున్నాడని, రేషన్ కార్డు దారులకు రెండు, మూడు కిలోలు తక్కువగా ఇస్తూ మిగితావి అమ్ముకుంటున్నాడని, సమయపాలన పాటించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతనెల 7వ తేదీన డీఎస్‌వో తనిఖీ చేయగా 25 క్వింటాళ్ల బియ్యం అమ్ముకున్నట్లు తేలిందని, డీలర్ అక్రమాలపై విచారణ జరిపి డీలర్‌షిప్‌ను తొలిగించాలన్నారు.

22న ఇసుక వేలం

వీణవంక: హుజూరాబాద్ కోర్టు ఆదేశాల మేరకు 22న తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నాలుగు ట్రాక్టర్ల ఇసుక బహిరంగ వేలం వేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నిజామొద్దీన్ ప్రకటనలో తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహించనున్నామని, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1800 చొప్పున డిపాజిట్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

చెస్ బోర్డులు పంపిణీ

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో గల గాయత్రీనగర్, కపిల్ బాలకుటీర్‌లో ఉంటున్న విద్యార్థులకు మంగళవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెస్ బోర్డులు పంపిణీ చేశారు. చెస్ నేర్చుకునేందుకు అవసరమైన ఆరు చెస్ బోర్డులు, అరటి పండ్లు అందజేశారు.